సాక్షి విశాఖపట్నం

బుధవారం ၊ 10 ၊ జూలై ၊ 2024



అర్ధరాత్రి సీపీ ఆకస్మిక పర్యటన

నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం అర్ధరాత్రి నగరంలో **ఆకస్మిక పర్యటన చేశారు.** 8లో



విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ప్రస్తుత పోటీ ప్రపంచంలో అధిక మార్కులు సాధిస్తేనే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని జీసీడీవో కల్పన అన్నారు. 8లో



రేసు రసవత్తరం

ఏపీఎల్ ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. ఉత్తరాంధ్ర లయన్స్‌తో రాయలసీమ కింగ్స్, వైజాగ్ వారియర్స్‌తో కోస్టల్ రైడర్స్ తలపడనుంది. 8లో

న్యూస్‌రీల్

15 బస్సులపై కేసులు నమోదు



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం : నిబంధనలు ఉల్లంఘించి నడుపుతున్న 15 స్కూలు బస్సులపై రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. సోమ, మంగళవారాల్లో అధికారులు పలు చోట్ల తనిఖీలు చేపట్టి స్కూలు, కళాశాలల బస్సులను తనిఖీ చేశారు. బస్సుల నిర్వహణ, విద్యార్థుల భద్రతపై పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. గత నెల 13 నుంచి ఇప్పటి వరకు స్కూలు, కళాశాలల బస్సులపై 51 కేసులు నమోదు చేశామని, 5 బస్సుల్ని సీజ్ చేశామని డీటీసీ రాజారత్నం తెలిపారు. ఈ తనిఖీల్లో రవాణా శాఖ అధికారులు బి. రాజారావు, ఐ. మాధవి, కె. పార్వతి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కూర్మావతారంలో జగన్నాథుడు



కూర్మావతారంలో భక్తులకు దర్శనం ఇచ్చిన జగన్నాథుడు

డాబాగార్డెన్స్ : టర్నర్ చౌల్ట్రీలో వెలసిన జగన్నాథ స్వామి కూర్మావతారంలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామికి మేలుకొలుపు, నాదస్వరం, 6 నుంచి 7 గంటల వరకు నిత్యపూజ, 7 నుంచి 9.30 గంటల వరకూ జగన్నాథస్వామి ప్రార్థనా సంఘంచే ప్రార్థనా తరంగిణి, 9.30 నుంచి 10.30 వరకూ సామూహిక లలితా సహస్రనామ పారాయణ, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. సాయంత్రం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి, అర్చకులు పాణంగిపల్లి జగన్నాథాచార్యులు, పాణంగిపల్లి రంగనాథాచార్యులు, పాణంగిపల్లి కేశవాచార్యులు, యేడిద సురేష్‌బాబు, అధికారులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు.

మాదక ద్రవ్యాల పట్టివేత

పోలీసుల అదుపులో నలుగురు

విశాఖ సిటీ: మాదక ద్రవ్యాలు తరలిస్తున్న ముఠాకు టాస్క్‌ఫోర్ పోలీసులు చెక్ పెట్టారు. గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక గ్రాము ఎండీఎంఏ, 3 లీటర్ల లిక్విడ్ గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అయితే మూడు రోజుల క్రితమే పోలీసులు నిందితులను పట్టుకున్నప్పటికీ.. ఆ విషయాన్ని ఇప్పటి వరకు బయటపెట్టలేదు. గోప్యంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు.. విశాఖ మీదుగా డ్రగ్స్ తరలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. దీంతో వారు గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు రోజుల క్రితం నిఘా పెట్టారు. ఈ సమయంలో తంగేటి భరత్, రామ్‌ప్రసాద్, శ్యాంసుందర్, గుర్రపు యశ్వంత్‌లను పట్టుకున్నారు. వీరిలో భరత్, రామ్‌ప్రసాద్‌లు పాత నేరస్తులు. గతంలో పలుమార్లు ఇదే తరహా కేసుల్లో అరెస్టయ్యారు. వీరి వద్ద ఒక గ్రాము ఎండీఎంఏ, 3 లీటర్ల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎండీఎంఏను కేరళ నుంచి, లిక్విడ్ గంజాయిని పాడేరు నుంచి సేకరించినట్లు పోలీసుల విచారణలో అంగీకరించినట్లు సమాచారం. ఈ కేసును పోలీసులు గోప్యంగా దర్యాప్తు చేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో కేసు వివరాలు వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.

ముగిసిన హ్యాండ్‌బాల్ పోటీలు



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న శ్రీనివాసులు

కంచరపాలెం: కంచరపాలెం 104 ఏరియా విజయనగర్ కేంద్రీయ విద్యాలయం–2లో ప్రాంతీయ స్థాయి అండర్–14, 17 బాలుర హ్యాండ్‌బాల్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. అనంతరం విజేతలకు ఆయన ట్రోఫీలు అందజేశారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన వివరించారు. ఆయా పాఠశాలల క్రీడా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక దుమారం

ధర వసూలు చేస్తూ.. ఉచితం అనడం సముచితమేనా? ఇదీ అసంతృప్తి, ఆగ్రహంతో ప్రజలు చేస్తున్న వ్యాఖ్య. ఫ్రీ ఇసుక అని ఊదరగొట్టి చివరకు ఇలా చేశారేమిటని రుసరుసలాడుతున్నారు. దాదాపుగా గతంలో ఉన్న చార్జీలనే ఇప్పుడూ వసూలు చేస్తున్నారు.. తేడా ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దానికి తోడు ఇసుక దోపిడీ ఒకటి. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఇసుక నిల్వలు తరలిపోయాయని పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. వర్షాల నేపథ్యంలో ఇబ్బందుల్లేకుండా ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే గత ప్రభుత్వం స్టాక్ పాయింట్ల వద్ద భారీ స్థాయిలో ఇసుక నిల్వలు అందుబాటులో ఉంచింది. ఎన్నికల ఫలితాల తర్వాత సీన్ మారిపోయింది. నెల రోజుల వ్యవధిలో రూ.5.75 కోట్ల విలువైన 56 వేల మెట్రిక్ టన్నుల ఇసుక దోపిడీకి గురైంది. మొత్తంగా ఈ వ్యవహారంపై దుమారం రేగుతోంది.



భీమిలి డిపోలో లారీలో లోడింగ్ జరుగుతున్న ఇసుక

- చెప్పిందొకటి.. చేసిందొకటి
- ఉచితమంటూనే ధర వసూలు
- దాదాపుగా అంతే ఖర్చు
- నిరాశకు లోనైన వినియోగదారులు
- మందకొడిగా కొనుగోళ్లు

అగనంపూడి/భీమిలి/నక్కపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లాలో భీమిలి, అగనంపూడి, నర్సీపట్నం(గబ్బాడ), నక్కపల్లిలో ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయి. ఉచితం పేరుతో చేసిన ప్రచారం నమ్మిన ప్రజలు కంగు తింటున్నారు. కొనేవారు లేక డిపోలు వెలవెలబోతున్నాయి. అగనంపూడి డిపోలో గతంలో ఇసుక ధర రూ.1400 ఉండగా, కొత్త పాలసీ ప్రకారం రూ.1,394 ధరగా నిర్ణయించారు. కేవలం ఆరు రూపాయలే వ్యత్యాసం ఉండడంతో భవన నిర్మాణదారులు పెదవి విరుస్తున్నారు. గత ప్రభుత్వంలో ఓ ట్రాక్టర్ ఇసుక ధర (ఐదు టన్నులు) అగనంపూడి డిపో నుంచి గాజువాకకు రూ.7వేలు కాగా.. ఇప్పుడు రూ.6,970గా ఉంది. వీటికి రవాణా చార్జీలు అదనం. రవాణా చార్జీల్లో అప్పటికి, ఇప్పటికి వ్యత్యాసం లేదు. అగనంపూడి డిపో నుంచి గాజువాకకు ట్రాక్టర్‌కు కిరాయి రూ.1,600 తీసుకుంటున్నారు. ఈ లెక్కన చూస్తే ట్రాక్టర్ లోడ్ ఇసుక బుక్ చేసుకున్న చోటుకు చేరవేసేందుకు రూ.8,570 (గతంలో రూ.8,600) చెల్లించుకోవాల్సి వస్తుండడంతో.. కొత్త పాలసీ వల్ల తమకు ఏ లాభం లేదని బహిరంగంగా చెబుతున్నారు. కేవలం రూ.30 మాత్రమే వ్యత్యాసం ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అదే లారీతో ఇసుక తీసుకువెళ్లే వారికి రూ.60 మాత్రమే తక్కువ. ఈ మాత్రం దానికి కొత్త ఇసుక పాలసీ అని గొప్పలు ఎందుకని విమర్శలు వినిపిస్తున్నాయి.

- భీమిలి ఇసుక ర్యాంపులో 50 వేల టన్నులపైనే ఇసుకను నిల్వ చేశారు. ఇక్కడ ఇసుక నిల్వల్లో ఎలాంటి తేడాల్లేవు. కూటమి ప్రభుత్వం టన్ను ఇసుక ధర రూ.758గా నిర్ణయించింది. ఈ ధర గతంలో కంటే రూ.300 తక్కువ.
- నక్కపల్లి ఇసుక డిపో వద్ద గతంలో టన్ను ఇసుకను రూ.1,200కు విక్రయిస్తే, ప్రస్తుత ధర రూ.1,225గా నిర్ణయించారు. దీనికి రవాణా చార్జీలు అదనం. నక్కపల్లి నుంచి ట్రాక్టర్‌పై ఇసుక తరలించడానికి 5 కిలోమీటర్లు లోపయితే రూ.500, దాటితే రూ.1,000 వసూలు చేస్తారు.
- నర్సీపట్నంలో గత ప్రభుత్వం లక్ష టన్నుల మేర ఇసుకను నిల్వ చేసింది. ప్రస్తుతం ఇక్కడ కేవలం 48,204 టన్నుల ఇసుక మాత్రమే ఉంది. 50 వేల టన్నులకు పైనే ఇసుక మాయమైనట్లు ఆరోపణలున్నాయి. ఇదంతా ఫలితాలు వెల్లడైన నెల రోజుల్లోనే జరిగినట్లు సమాచారం. దీంతో ప్రభుత్వ ఖజానాకు రూ.5 కోట్లుకు పైగా గండి పడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తొలి నాలుగేళ్లు టన్ను ఇసుక రూ.1,250కు విక్రయించారు. చివరి ఏడాది కాంట్రాక్టర్ మారడంతో ఆ ధర రూ.1,400 చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇక్కడ టన్ను ఇసుక ధర రూ.1,225గా నిర్ణయించింది.



అగనంపూడి ఇసుక డిపో

రెండో రోజు 17 టన్నులే..

నక్కపల్లి డిపోలో ఇసుక విక్రయాలు సోమవారం నుంచి ప్రారంభించారు. తొలి రోజు ఎవరూ కొనుగోలుకు ముందుకు రాలేదు. రెండో రోజైన మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కేవలం 17 టన్నుల మాత్రమే ఇసుక విక్రయాలు జరిగినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. మైనింగ్, పంచాయతీరాజ్, పోలీసు, సచివాలయ సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు డిపో వద్ద పడిగాపులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. నర్సీపట్నంలో ఇంకా విక్రయాలే ప్రారంభం కాలేదు.

యథేచ్ఛగా దోపిడీ

సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్ర**బాబు జూలై 8 నుం**చి నూతన ఇసుక పాలసీ **అమలు చేస్తామని** కొద్దిరోజుల క్రితం ప్రకటిం**చారు. ఉచితంగా** ఇస్తున్నట్టు అధికార పక్షం **ఊదరగొట్టింది. కానీ** చేతల్లో మాత్రం వేరే **విధంగా ఉంది.** దానికి తోడు ఇసుక దోపిడీ **ఒకటి. నక్కపల్లి** ఇసుక డిపో వద్ద ఎన్నికల **నోటిఫికేషన్‌కు ముం**దు 32 వేల టన్నుల ఇసుక **నిల్వ చేసినట్లు** అధికారిక సమాచారం. ఎన్నికల **ఫలితాల తర్వాత నుం**చే ఇక్కడ ఇసుక దోపిడీ **మొదలయింది.** అధికారుల అండదండలతో కూటమి నేతలు ఇసుకను తరలించుకుపోయారు. తాజా లెక్కల్లో 6 వేల టన్నుల ఇసుక మాయమైనట్లు అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. దీని విలువ సుమారు రూ.75 లక్షలుగా తేల్చారు. నర్సీపట్నం గబ్బాడ యార్డులో ఎన్నికల ఫలితాలకు ముందు లక్ష టన్నుల ఇసుక ఉండేదని, ఫలితాలు వెలువడిన మరుసటి రోజే టీడీపీ నాయకులు యార్డును స్వాధీనం చేసుకున్నారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ ఆరోపించారు. లక్ష టన్నులు ఉండాల్సిన ఇసుక ప్రస్తుతం 48 వేలే ఉందని అధికారులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ఉచితం అంటే ఇదేనా.?

ఉచితమని ఊరించారు. తీరా ఇసుక పాలసీ ప్రకటించిన తర్వాత అసలు విషయం బోధపడింది. గతానికి భిన్నంగా ధరలు ఉంటాయనుకుంటే ఇంతలా భవన నిర్మాణదారులు, తాపీ పని వారిని మోసం చేస్తారనుకోలేదు. తూర్పుగోదావరి జిల్లాలోని ర్యాంప్‌ల నుంచి ఇసుక అగనంపూడి డిపోకు తరలించడానికి టన్నుకు రూ.1,396 వ్యయం అవుతుందంటే నమ్మశక్యంగా లేదు. కేవలం రవాణా చార్జీలే వసూలు చేస్తే ఇంత మొత్తం అవసరం లేదు. ప్రభుత్వం పునరాలోచించాలి.

– పి.పి.రామారావు, భవన నిర్మాణ కాంట్రాక్టర్, రాజీవ్‌నగర్

తేడా ఏముంది?

గతంతో పోల్చితే టన్ను ఇసుక ధర మీద కేవలం ఆరు రూపాయలే తగ్గించారు. ఉచితంగా ఇసుక అందిస్తే నిర్మాణ వ్యయం తగ్గుతుందని భావించాం. కానీ రవాణా చార్జీల పేరుతో గతంలో మాదిరిగా వసూలు చేస్తే సామాన్యులకు ఏ లాభం ఉంటుంది?

– కె.తేజేశ్వరరావు, వడ్లపూడి నిర్వాసితకాలనీ

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ బదిలీ

- ఏపీటీఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియామకం
- కొత్త కమిషనర్‌ను వేయని ప్రభుత్వం
- కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించాలని ఉత్తర్వులో ఆదేశం



విశాఖ సిటీ: జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ బదిలీ అయ్యారు. ఏపీ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆయన స్థానంలో జీవీఎంసీ కమిషనర్‌గా ఎవరినీ నియమించలేదు. బాధ్యతలను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిరప్రసాద్‌కు అప్పగించాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సాయికాంత్ వర్మ 2023 ఏప్రిల్ 15న జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

సుందర విశాఖలో కీలక పాత్ర

సాయికాంత్‌వర్మ విశాఖ అభివృద్ధి, సుందరంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. మౌలిక సదుపాయాల కల్పన, జంక్షన్ల అభివృద్ధిపై, పార్కుల ఆధునికీకరణ, బహిరంగ వ్యాయామశాలల ఏర్పాటు వంటి అంశాలపై దృష్టి పెట్టారు. ప్రధానంగా నగరంలో పలు ప్రాంతాల్లో చిన్న చిన్న అభివృద్ధి పనులతోనే జంక్షన్లను ఆకర్షణీయంగా తీరిదిద్దారు. సిరిపురంలో జంక్షన్ ఆధునికీకరణ, జగదాంబ జంక్షన్ వద్ద క్లాక్ టవర్‌తో పాటు రైల్వే న్యూకాలనీ, అక్కయ్యపాలెం, ఉషోదయ జంక్షన్, ఎంవీపీ సర్కిల్, ఎన్ఏడీ కొత్తరోడ్డు ఇలా అనేక జంక్షన్లలో వాటర్ ఫౌంటెన్లు, వివిధ కళాకృతులను ఏర్పాటు చేసి కూడళ్లకు కొత్త కళను తీసుకువచ్చారు. బీచ్ పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చారు.

వాయిదా పడిన పరీక్ష రేపు

ఏయూ క్యాంపస్: విద్యార్థి సంఘాల బంద్ కారణంగా ఈ నెల 4న వాయిదా పడిన డిగ్రీ రెండు, నాలుగో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలను గురువారం నిర్వహించనున్నట్టు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.చిట్టిబాబు తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నాలుగో సెమిస్టర్ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు తదనుగుణంగా పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

కేంద్ర ఉక్కు మంత్రి పర్యటనపై ఉత్కంఠ

విశాఖ సిటీ: కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి విశాఖ పర్యటనకు వస్తుండడం చర్చనీయాంశమైంది. ఒక వైపు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, పరిశ్రమల ఆస్తుల విక్రయాల అంశాలు అగ్గి రాజేస్తున్న వేళ.. మంత్రి ప్లాంట్ సందర్శన ఆసక్తి రేకెత్తిస్తోంది. మంత్రి కుమారస్వామి బుధవారం సాయంత్రం 6.30 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఆర్ఐఎన్ఎల్ అతిథి గృహానికి వెళతారు. రాత్రి అక్కడే బస చేస్తారు. మరుసటి రోజు గురువారం ఉదయం 9గంటలకు స్టీల్‌ప్లాంట్‌ను సందర్శిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12.30 వరకు ప్లాంట్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.45కు విశాఖ విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేక విమానంలో ఒంటి గంటకు హైదరాబాద్‌కు పయనమవుతారు. ఇదిలా ఉంటే.. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా చూస్తామని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు స్టీల్‌ప్లాంట్‌కు వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఆస్తుల వేలానికి బోర్డు ఆమోద ముద్ర వేసింది. కార్మిక సంఘాలు, ఉద్యోగులు ఈ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ.. వెనకడుగు వేయడం లేదు. మూలధన పెట్టుబడులను సమీకరించుకోవడంలో భాగంగా ఆస్తుల విక్రయాలు తప్పనిసరి అని యాజమాన్యం చెబుతోంది. ఈ వేలంతో సమకూరే నగదు సరిపోదని, సంస్థ కష్టాల నుంచి బయట పడాలంటే ఉద్యోగులు చందాలు ఇవ్వాలని రెండు రోజుల కిందటే ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం పిలుపునివ్వడం హాట్ టాపిక్‌గా మారింది. ఇటువంటి తరుణంలో కేంద్రమంత్రి స్టీల్‌ప్లాంట్ సందర్శన, సమీక్షపై అందరిలో ఒకటే ఉత్కంఠ నెలకొంది.

ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

మహారాణిపేట : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత జిల్లా అధికారులను ఆదేశించారు. మెడ్ టెక్ జోన్ సమావేశ మందిరంలో సీఎం పర్యటన ఏర్పాట్లపై మంగళవారం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా ఈనెల 11వ తేదీన చంద్రబాబు విశాఖకు విచ్చేస్తున్నారని, ఆయన పర్యటన ఏర్పాట్లలో ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు ఉండరాదని స్పష్టం చేశారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భోగాపురం నుంచి 11వ తేదీ మధ్యాహ్నం 1.45 గంటలకు స్టీల్ ప్లాంట్‌లోని మెడ్‌టెక్ జోన్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారన్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు సీఐఐ ఆధ్వర్యంలో జరిగే జాతీయ మండలి సదస్సులో వర్చువల్‌గా పాల్గొంటారని తెలిపారు. అదే ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన రెండు మందుల తయారీ యూనిట్లను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం విశాఖ ఎయిర్ పోర్ట్‌కు చేరుకుంటారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు అక్కడే అధికారులతో సమావేశమవుతారన్నారు. 6.10 గంటలకు విమానంలో విజయవాడ వెళ్తారని తెలిపారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ కె.ఫకీరప్ప, జీవీఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్ కుమార్, ఆర్డీవోలు డి.హుస్సేన్ సాహెబ్, ఎస్.భాస్కర్ రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఆర్అండ్‌బీ, ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్లు కె.కాంతిమతి, ఎల్.మహేంద్రనాథ్, జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు, పోలీస్ అధికారులు, మెడ్ టెక్ అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకులపై రాజకీయ జోక్యం తగదు

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- ఘనంగా కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు రజతోత్సవం
- హాజరైన మిజోరం గవర్నర్ హరిబాబు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్ హరిబాబు, ఎంపీ శ్రీభరత్

మద్దిలపాలెం : బ్యాంకుల పురోగతితోనే దేశ ఆర్థిక అభివృద్ధి సాధ్యమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. బ్యాంకులు అభివృద్ధి చెందాలంటే రాజకీయ జోక్యం ఉండకూడదని స్పష్టం చేశారు. కనకమహలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు రజతోత్సవం మంగళవారం మద్దిలపాలెం కాకతీయ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వెంకయ్యనాయుడుతో పాటు మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఎన్నికలు సకాలంలో జరిగితే దేశ ఆర్థికాభ్యున్నతి బాగుంటుందన్నారు. రిజర్వుబ్యాంకు సకాలంలో తమ విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. అప్పుడే బ్యాంకులు ప్రగతి పథంలో నడుస్తాయన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా బ్యాంకులు రుణాలు ఇస్తే వాటిని తిరిగి సకాలం చెల్లిస్తారన్నారు. ఇలాంటి ప్రక్రియలపై రాజకీయ ప్రమేయం ఉండకూడదని సూచించారు. ఉచితానికి ఆశపడితే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. మిజోరం గవర్నర్ హరిబాబు మాట్లాడుతూ ప్రజల ఆర్థిక ఇబ్బందులకు సహకార బ్యాంకులు ఆసరాగా నిలవాలన్నారు. అనంతరం బ్యాంకు 25 ఏళ్ల ప్రగతిని, ఖాతాదారులకు అందించిన సేవలను బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు వివరించారు. సభ్యులకు 15శాతం డివిడెండ్ ప్రకటించారు. అనంతరం రజతోత్సవాల్లో భాగంగా రూపొందించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, విశాఖ జాయింట్ రిజిస్ట్రార్ టి.ప్రవీణ, విశాఖ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, పలు బ్యాంకులు చైర్మన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పెండింగ్ పనుల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

తాటిచెట్లపాలెం : వాల్తేరు డివిజన్ పరిధిలో పెండింగ్ పనుల పరిష్కారానికి కృషి చేస్తానని కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. డీఆర్ఎం కార్యాలయంలో వాల్తేర్ డివిజన్ పరిధిలో రైల్వే ప్రయాణికులకు అందుతున్న సదుపాయాలు, అమృత్ భారత్‌స్టేషన్ల అభివృద్ధి పనులు, రైళ్ల హాల్ట్‌లు, రైళ్ల పొడిగింపు తదితర అంశాలపై మంగళవారం మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల గురించి ఆయనకు వివరించారు. ఈ సమీక్షలో విశాఖ, విజయనగరం ఎంపీలు ఎం.శ్రీభరత్, కె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: భద్రత, ఆధునికీకరణ పనుల నిమిత్తం పలు రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు.

- విశాఖపట్నంలో బయలుదేరే విశాఖపట్నం – కోర్బా (18518) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11 నుంచి 15 వరకు బిలాస్‌పూర్ వరకు మాత్రమే నడుస్తుంది.
- కోర్బాలో బయల్దేరాల్సిన కోర్బా – విశాఖపట్నం (18517) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12 నుంచి 16 వరకు బిలాస్పూర్ నుంచి బయల్దేరుతుంది.
- విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం – పలాస (07470) రైలు ఈ నెల 11, 13న శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే నడుస్తుంది.
- పలాసలో ఈ నెల 11, 13న బయల్దేరాల్సిన పలాస – విశాఖపట్నం (07471) రైలు శ్రీకాకుళం రోడ్ నుంచి బయల్దేరుతుంది.

ఆస్పత్రి వద్ద మృతుడి బంధువుల ఆందోళన



అపోలో ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగిన మృతుడి బంధువులు, స్థానిక పెద్దలు

ఆరిలోవ: హెల్త్ సిటీలోని అపోలో ఆస్పత్రి వద్ద మృతుడి బంధువులు మంగళవారం ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆరిలోవ ప్రాంతం బాలాజీనగర్‌కు చెందిన పి.నిఖిల్ వెంకటసాయి(15) కొద్ది రోజుల క్రితం తీవ్ర జ్వరం, ఫిట్స్‌కు గురయ్యాడు. దీంతో సుమారు 20 రోజుల క్రితం నికిల్‌ను అతని తల్లిదండ్రులు హెల్త్‌సిటీలోని అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఆస్పత్రిలో చేర్పించినప్పటి నుంచి ఆ బాలుడి తల్లిదండ్రులు రూ.3.5 లక్షలు చెల్లించడంతో పాటు మరో రూ.6.50 లక్షలు ఇన్సూరెన్స్ క్లెయిమ్ కోసం పెట్టారు. మంగళవారం బాలుడి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించడానికి ఆస్పత్రి నిర్వాహకులు బ్యాలెన్స్‌గా ఉన్న సుమారు రూ.10 లక్షలు చెల్లించాలన్నారు. బాలుడి తల్లిదండ్రులు అంత చెల్లించలేమని చెప్పినా ఆస్పత్రి నిర్వాహకులు వినలేదు. ఈ వ్యవహారం గందరగోళానికి దారితీసింది. విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు బాలాజీనగర్, తోటగరువు నుంచి పెద్ద సంఖ్యలో ఆస్పత్రి వద్దకు చేరుకొన్నారు. మృతదేహానికి రూ.లక్షల్లో చెల్లించడమేమిటంటూ కొంతసేపు ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. దీంతో స్థానిక పెద్దలు కొందరు ఆస్పత్రి నిర్వాహకులతో సంప్రదింపులు జరిపారు. దీనికి దిగివచ్చిన ఆస్పత్రి నిర్వాహకులు బాలుడి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో ఆందోళన సద్దుమనిగింది. వెంకటసాయి ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్నట్లు బంధువులు తెలిపారు.



ఏమో సార్.. మాకు కనబడదు.!

'నన్ను ధరించు మీకు పునర్జన ఇస్తాను'అని ఫ్లెక్సీలు అమర్చిన ప్రాంతంలోనే హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్నారు. 'ట్రిపుల్ రైడింగ్‌కు నో చెప్పండి' అని ప్రచార బోర్డులు ఉన్న చోటే ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నా.. వాహనచోదకులకు ఇవేమీ పట్టడం లేదు. ఫ్లెక్సీలను చూస్తూనే.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. పోలీసుల ప్రయత్నాలను నీరుగారుస్తున్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, హెల్మెట్ లేకుండా, ట్రిపుల్ రైడింగ్ చేస్తూ వాహనాలు నడుపుతున్న ఈ దృశ్యాలు.. వాహనచోదకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం







అర్ధరాత్రి సీపీ ఆకస్మిక పర్యటన

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం అర్ధరాత్రి నగరంలో ఆకస్మిక పర్యటన చేశారు. రాత్రి సమయంలో నగరంలో వాస్తవిక పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. పలు ప్రాంతాల్లో బహిరంగ మద్యపానం చేస్తున్న వారిని పట్టుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్న ఒకరిపై కేసు నమోదు చేశారు. రోడ్డుపై ఉన్న ట్రాన్స్‌జెండర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోపై కేసు నమోదు చేశారు. సీపీ ఇచ్చిన సమాచారంతో నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న పలు ద్విచక్ర వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. దొంగను పట్టుకుని నిర్బంధించినట్టు సీపీ ఇచ్చిన 7995095799కు ప్రజల నుంచి వచ్చిన సమాచారం మేరకు సీపీ వెంటనే డీసీపీ(క్రైమ్) వెంకటరత్నంతో మాట్లాడారు. అక్కడికి పోలీసులను తక్షణమే పంపించి సదరు దొంగను అరెస్టు చేశారు. ఈ పర్యటనలో చివరిగా మహారాణిపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. అక్కడి సిబ్బంది నిర్వహిస్తున్న విధుల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నగర ప్రజలు 79950 95799 నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీసులు పట్టించుకోకపోయినా, లంచం అడిగినా లేదా తీసుకున్నా, ఎటువంటి సమస్యలు ఉన్నా సదరు నంబర్ ద్వారా స్వయంగా తనకు తెలియజేయాలని సూచించారు.

బైక్ ఢీకొని పాదచారుడి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



మృతుడు త్రినాథరావు



సంఘటన స్థలంలో గాయపడిన సన్యాసిరావు



ప్రమాదానికి కారణమైన బైక్

గోపాలపట్నం: రోడ్డు దాటుతున్న పాదచారులను ద్విచక్ర వాహనంతో ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మర్రిపాలెం హైవే జ్యోతినగర్ డీ మార్ట్ ఎదురుగా గల సెంటర్ రోడ్డులో మంగళవారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. మాధవధార కొండగనగర్ సాయిరాంనగర్‌లో ఉంటున్న జొన్నాడ సన్యాసిరావు(38) ఆటోలో ఇసుక, బిల్డింగ్ మెటీరియల్ సప్లయ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మురళీనగర్ పట్టాభిరెడ్డి తోట వృద్ధాశ్రమం వద్ద నివాసం ఉంటున్న ఎలమంచిలి త్రినాథరావు కూలి పనులు చేసుకొని జీవన సాగిస్తున్నాడు. ఇద్దరూ మంగళవారం రాత్రి 7.20 సమయంలో డీ మార్ట్ ఎదురుగా రోడ్డు దాటుతుండగా కంచరపాలెం వైపు నుంచి వేగంగా బైక్ పై వచ్చిన యువకుడు బలంగా ఢీకొట్టి కొంత దూరం ఈడ్చుకుని వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న కంచరపాలెం ట్రాఫిక్ ఎస్ఐ బాలరాజు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని సమీప ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో త్రినాథరావు(40) మృతి చెందాడు. మృతుడికి భార్య కొండమ్మ, డిప్లమో చదువుతున్న ఉదయ్ కిరణ్, 8వ తరగతి చదువుతున్న మోహన్‌సాయి ఉన్నారు. తీవ్రంగా గాయపడ్డ సన్యాసిరావుకు రెండు కాళ్లు విరిగిపోయి కోమాలోకి వెళ్లిపోయాడు. అతడిని కుటుంబ సభ్యులు 108లో కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య పోలమ్మ, కుమార్తె చాందిని కుమారుడు శేఖర్ ఉన్నారు. ఇద్దరూ డిగ్రీ చదువుతున్నారు. బైక్‌తో యాక్సిడెంట్ చేసిన యువకుడు మర్రిపాలెం మహారాణి వీధికి చెందిన క్రాంతిగా గుర్తించారు. అతడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విశాఖ విమానాశ్రయంలో పనిచేస్తున్నాడని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి మితిమీరిన వేగమే కారణమని నిర్ధారణకు వచ్చారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఆటో దినోత్సవం



ఆటో స్టాండ్‌లో కేక్ కట్ చేస్తున్న ఆటో డ్రైవర్లు, వరుణ్ మోటార్స్ ప్రతినిధులు

బీచ్ రోడ్డు: వరుణ్ మోటార్స్ ఆధ్వర్యంలో ఆటో దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ఆటో స్టాండ్లలో కేక్ కట్ చేశారు. ఆటో కార్మికులకు దుస్తులు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తరాంధ్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆటో దినోత్సవాన్ని నిర్వహించి ఆటో సోదరులు ఆనందోత్సాహాలు జరుపుకొన్నారని వరుణ్ మోటార్స్ ప్రతినిధి వంశీ తెలిపారు. ప్రతి నిత్యం కొన్ని లక్షల ప్రయాణికులను రాత్రి పగలు అనే సమయంతో సంబంధం లేకుండా తమ తమ గమ్యస్థానాలకు చేర్చే ఆటో సోదరులకు మనమెంతో రుణపడి ఉంటామన్నారు. ఈ ఆటో డే సందర్భంగా బజాజ్ మ్యాక్సిమా అండ్ కార్గోలను ఫైనాన్స్ ద్వారా కొనుగోలు ద్వారా చేసిన వారికి మొదటి వాయిదాను వారి తరఫున తామే చెల్లిస్తామని ప్రకటించారు. ఆటో కొనుగోలు చేసిన వారికి ఖాకీ చొక్కా, 5 లీటర్ల డీజిల్ ఉచితంగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బజాజ్‌లో ఆటో రీజనల్ మేనేజర్ కార్తీక్, ఏఎస్ఎం రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సూర్యకిరణ్ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

అగనంపూడి: మల్కాపురానికి చెందిన దాడి సూర్యకిరణ్ హత్య కేసులో నిందితుడు కొర్లయ్యను దువ్వాడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సూర్యకిరణ్ శ్రీనగర్‌కు చెందిన పసుపులేటి మేఘనను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరి వివాహానికి మేఘన తల్లి సుజాత నిరాకరించింది. వివాహానంతరం సూర్యకిరణ్ భార్య మేఘనతో కలిసి హైదరాబాద్ వెళ్లిపోయాడు. అక్కడ ట్యాక్సీ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మేఘన గర్భవతి కావటంతో ఇటీవల ఆమెను తీసుకొని మల్కాపురానికి వచ్చేశాడు. డెలివరీ కోసం ఆమెను అగనంపూడి ఆస్పత్రిలో చేర్పించాడు. మేఘన ప్రసవించటంతో తల్లీ బిడ్డలను చూడడానికి ఆమె తల్లి సుజాత మూడు రోజుల క్రితం ఆస్పత్రికి వచ్చింది. అయితే కూతురు, మనుమరాలిని చూడటానికి వీల్లేదని సూర్యకిరణ్ ఆమెకు అడ్డుపడటంతో వారి మధ్య ఘర్షణ జరిగింది. విషయం తెలుసుకున్న సుజాతతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న కొర్లయ్య సోమవారం రాత్రి ఆవేశంతో సూర్యకిరణ్‌ను కత్తితో పొడిచి హత్య చేశాడు. పోలీసులు కొర్లయ్యను అదుపులోకి తీసుకొని మంగళవారం న్యాయస్థానంలో హాజరు పరిచారు. న్యాయమూర్తి అతడికి రిమాండ్ విధించారు. దువ్వాడ సీఐ వావిలపల్లి ఎర్రంనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేసు రసవత్తరం

- రేపటి నుంచి నాకౌట్ పోటీలు
- లయన్స్‌తో కింగ్స్, వారియర్స్‌తో రైడర్స్ ఢీ



మ్యాచ్ బెస్ట్‌గా నిలిచిన వికెట్ కీపర్ లేఖజ్



అర్ధసెంచరీతో అజేయంగా నిలిచిన అభిషేక్

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ మూడో సీజన్ ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. క్వాలిఫైయిర్-1 మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్‌తో రాయలసీమ కింగ్స్ తలపడనుండగా.. ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్‌తో కోస్టల్ రైడర్స్ తలపడనుంది. క్వాలిఫైయిర్-2 మ్యాచ్‌లో క్వాలిఫైయిర్-1 ఓడిన జట్టుతో ఎలిమినేటర్‌లో విజయం సాధించిన జట్టు తలపడనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టు.. క్వాలిఫైయిర్-1లో విజయం సాధించిన జట్టు టైటిల్ పోరుకు సిద్ధమవుతాయి.

టైటాన్స్‌పై రైడర్స్ విజయం

పీఎంపాలెంలోని వైఎస్సార్ స్టేడియంలో లీగ్ దశ చివరి రోజు మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో గోదావరి టైటాన్స్‌పై కోస్టల్ రైడర్స్ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టైటాన్స్ పవర్ ప్లే ఆరు ఓవర్లలోనే 48 పరుగులు చేసినా కీలక నాలుగు వికెట్లు కోల్పోయింది. టైటాన్స్ ఓపెనర్ కెప్టెన్ జ్ఞానేశ్వర్(5) ఇన్నింగ్స్ రెండో బంతిని కవర్స్ మీదుగా బౌండరీకి తరలించినా..అదే ఓవర్ చివరి బంతికి స్టీఫెన్ బౌలింగ్‌లో వికెట్ల వెనుక లేఖజ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అతని స్థానంలో వచ్చిన హేమంత్ రెండో ఓవర్‌లో వరసగా రెండు బంతులను బౌండరీకి తరలించినా చివరి బంతికి ప్రమోద్ బౌలింగ్‌లో వికెట్ల వెనుక లేఖజ్‌కు దొరికిపోయాడు. మరో ఓపెనర్ వంశీకృష్ణ (29) రనౌటై వెనుదిరిగాడు. సందీప్ (7), పాండురంగరాజు డకౌట్‌గానే పెవిలియన్‌కు చేరారు. ప్రసాద్(15), సమన్విత్(22), శశికాంత్(24) ఇన్నింగ్స్‌ను సరిదిద్దే ప్రయత్నం చేశారు. ప్రమోద్ మూడు వికెట్లు, ఆశిష్ రెండు వికెట్లు తీయడంతో చివరికి 17.1 ఓవర్లలోనే 138 పరుగులకు ఆలౌటైంది. వర్షం కారణంగా 18 ఓవర్లకు మ్యాచ్‌ను కుదించారు. బ్యాటింగ్ ప్రారంభించిన రైడర్స్ ఓపెనర్ అర్జున్ టెండూల్కర్(19) 25 పరుగుల వద్ద పెవిలియన్‌కు చేరాడు. రైడర్స్ సయితం పవర్‌ప్లేలో 48 పరుగులే చేసినా ఒక వికెటే కోల్పోయింది. స్టేడియంలో మరోసారి వర్షం కురిసే అవకాశం ఉండటంతో వీజేడీ పద్ధతి దృష్టిలో పెట్టుకుని రైడర్స్ తొమ్మిది ఓవర్లకు 59 పరుగులు చేయాల్సి ఉండగా.. రషీద్ స్కోర్‌ను 69కి చేర్చాడు. రషీద్(39) శశికాంత్ బౌలింగ్‌లో తేజకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. రెండో వికెట్‌కు అభిషేక్‌తో కలిసి 81 పరుగులు జోడించాడు. విజయానికి మరో మూడు పరుగులు చేయాల్సిన స్థితిలో వర్ధన్(15) విజయ్ బౌలింగ్‌లో రాజుకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. లేఖజ్ డకౌటయ్యాడు. అభిషేక్(61) అర్ధసెంచరీతో అజేయంగా నిలిచి జట్టును నాకౌట్‌కు చేర్చాడు. రైడర్స్ 17.3 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసింది. తేజ రెండు వికెట్లు తీశాడు.

గర్జించిన ఉత్తరాంధ్ర లయన్స్

లీగ్ చివరి మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన బెజవాడ టైగర్స్ ఏడు వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసింది. లీగ్ పాయింట్ల పట్టికలో ఆధిక్యమే లక్ష్యంగా ఉత్తరాంధ్ర లయన్స్ ఆది నుంచే పట్టు బిగించింది. దీంతో టైగర్స్ తొలి నాలుగు వికెట్లను 54 పరుగులకే కోల్పోయింది. ఓపెనర్ ధృవ్ కుమార్(70) మరో ఎండ్‌లో సహకారం లేక వికెట్లు కోల్పోతున్నా.. అర్ధసెంచరీ నమోదు చేశాడు. రాహుల్(32)తో కలిసి ఐదో వికెట్‌కు 55 పరుగులు జోడించాడు. వీరిద్దరూ మినహా మరే బ్యాటర్ రెండంకెల స్కోర్ చేయలేకపోయారు. ముగ్గురు ఏకంగా రనౌటై పెవిలియన్‌కు చేరారు. తేజస్వి రెండు వికెట్లు తీశాడు. ప్రతిగా బ్యాటింగ్ దిగిన లయన్స్ కూడా 30 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ తరుణ్ 15 పరుగులు చేశాడు. రాహుల్(38) శ్రీనివాస్(40 నాటౌట్) ఐదో వికెట్‌కు 75 పరుగులు జోడించారు. చివరికి మరో నాలుగు బంతులుండగానే లయన్స్ విజయలక్ష్యాన్నందుకుంది. లీగ్‌లో టైగర్స్ ఐదు మ్యాచ్‌ల్లోనూ పాయింట్ల ఖాతా ప్రారంభించకుండానే మూడో సీజన్ ముగించింది. నాకౌట్ పోటీలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి.

కలలు కన్నీరై...

ఆ దంపతులిద్దరూ కూలీలే అయినా వారి జీవితం ఆనందమయం. వచ్చిన కూలి డబ్బులతో ఉన్నంతలో సంతోషంగా ఉండేవారు. వారి అన్యోన్యతను చూసి ఊరే ముచ్చటపడేది. వివాహమైన 15 ఏళ్లకు ఇద్దరు కవలలు జన్మించడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పిల్లలను చూస్తూ మురిసిపోయేవారు. ఇంతలో విధి కన్నెర్ర చేసింది. పిల్లల మందుల కోసం వెళ్లిన భర్తను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కాటేసింది. ఇద్దరు పిల్లలు, భార్యను అనాథలను చేసింది. కలలను కన్నీటితో తుడిచేసింది.

- పెళ్లయిన 15 ఏళ్లకు ఇద్దరు పిల్లలు
- సంతోషంలో మురిసిపోయిన కూలి దంపతులు
- పిల్లల మందులకు వెళ్లిన భర్త రోడ్డు ప్రమాదంలో మృతి
- అనాథలైన పిల్లలు, భార్య
- విషాదంలో వెంకటరమణపేట వాసులు



రోడ్డు ప్రమాదంలో చనిపోయిన గేదెల కృష్ణ

శృంగవరపుకోట: ఎస్.కోట మండలం వెంకటరమణపేటకు చెందిన గేదెల కృష్ణ(42) క్వారీ కార్మికునిగా జీవనం సాగిస్తున్నాడు. అతనికి లక్ష్మితో సుమారు 15 ఏళ్ల కిందట వివాహమైంది. సంతానం లేక పోవడంతో చాలా కాలంగా మదనపడ్డారు. సంతానం కోసం మొక్కని దేవుడు లేడు.. తిరగని ఆస్పత్రి లేదు. చివరకు రెక్కలు ముక్కలు చేసుకుని దంపతులిద్దరూ కూలిచేసి సంపాదించిన సొమ్ముతో శక్తికి మించి లక్షలు ఖర్చు చేసి సంతాన సాఫల్య కేంద్రంలో కొన్నేళ్లుగా వైద్యం చేయించుకున్నారు. వారి కలలు సాకారమై లక్ష్మి గర్భం దాల్చింది. దీంతో వాళ్ల సంతోషానికి అవధులు లేవు. రెండు నెలల కిందట కవలలు (మగబిడ్డ, ఆడబిడ్డ)లకు లక్ష్మి జన్మనిచ్చింది. బిడ్డలను చూస్తూ దంపతులిద్దరూ మురిసిపోయారు. అంతలోనే విధి కన్నెర్రచేసింది. ఇంటి దిక్కును మృత్యువు కాటేసి సంతోషాన్ని ఆవిరిచేసింది.

భర్త దూరం.. బతుకు భారం..



కవల పిల్లలతో దిక్కు తోచని స్థితిలో లక్ష్మి

క్వారీలో పనిచేసే కృష్ణ తన కష్టం మరిచిపోయి భార్య, బిడ్డలతో సరదాగా ఉన్నాడు. మంగళవారం ఉదయం బిడ్డలకు మందులు తెస్తానంటూ బైక్‌పై విశాఖ వెళ్తున్న సమయంలో వేపగుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు వదిలాడు. విషయం తెలుసుకున్న భార్య కన్నీరుమున్నీరవుతోంది. బిడ్డలకు, తనకు దిక్కెవరంటూ ఆమె రోదన వర్ణనాతీతం. కృష్ణ చనిపోయాడన్న వార్తతో ఊరంతా ఒక్కసారి గొల్లుమంది. భార్య లక్ష్మి రెండునెలల చిన్నారులను చెరో చెంకనెత్తుకుని ఏడుస్తుంటే ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు. ఏ దిక్కూలేని ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి దాతలు సహకరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


విద్యతోనే ఉజ్వల భవిష్యత్



నిఘంటువులతో విద్యార్థినులు, స్టూడెంట్స్ కిట్ రాష్ట్ర అబ్జర్వర్ కల్పన శైల

పద్మనాభం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో అధిక మార్కులు సాధిస్తేనే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని స్టూడెంట్స్ కిట్ రాష్ట్ర అబ్జర్వర్, సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర జీసీడీవో కల్పన అన్నారు. పద్మనాభం కస్తూర్బా విద్యాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించి స్టూడెంట్స్ కిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినులు పోటీ పడి చదివినప్పుడే అధిక మార్కులు సాధించగలరన్నారు. పదో తరగతి విద్యార్థుల్లో ఎక్కువ మందికి టెన్ బై టెన్ వచ్చేట్టు సీఆర్టీలు ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు. లిఫ్ ప్రాముఖ్యతను విద్యార్థినులకు తెలియజేశారు. డిక్షనరీలు ఉపయోగించి పదాల అర్థాలు తెలుసుకోవచ్చన్నారు. మధ్యాహ్నం భోజనం వంటకాలు రుచి చూశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీకి, సీఆర్టీలకు పలు సూచనలు చేశారు. ముందుగా ఆమె మండల విద్యాశాఖ కార్యాలయంలో స్టూడెంట్ కిట్ల స్టాకు, డీసీ బిల్లులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో పి.రమణ, సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ఏపీవో అప్పలనాయుడు, సీఆర్పీ ఎం.బంగారునాయుడు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థులకు నాసా ప్రశంసలు



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న శ్రీచైతన్య కాలేజీ ప్రతినిధులు

విశాఖ సిటీ: లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంకు శ్రీ చైతన్య ద్వారకానగర్ విద్యార్థులు రూపొందించిన రెండు ప్రాజెక్టులు ఎంపికయ్యాయని ఆ శాఖ ప్రిన్సిపాల్ రవికిరణ్ తెలిపారు. వీటిని రూపొందించిన విద్యార్థులు సామ్రాట్, అదిరిత్ నాసా శాస్త్రవేత్తల ప్రశంసలు పొందారని వెల్లడించారు. ఆ ఘనత సాధించిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర సంస్థల ఇన్‌చార్జి ఎం.వి.సురేష్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ప్రశంసించారు. విద్యార్థులు మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని అభివృద్ధిలోకి రావాలని కాలేజీ ప్రతినిధి మహమ్మద్ అలీ, కో-ఆర్డినేటర్ రాజేష్ ఆకాంక్షించారు. ఈ అభినందన సభలో డీన్‌లు గౌరీ నాయుడు, సురేష్, నాసా కో-ఆర్డినేటర్ అజయ్, పరీక్షల ఇన్‌చార్జి హేమకుమార్ పాల్గొన్నారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఆయా డివిజన్ల పరిధిలో జరుగుతున్న భద్రత, ఆధునికీకరణ పనుల కారణంగా పలు రైళ్లను రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

- ఈ నెల 11న మధ్యాహ్నం 12.10 గంటలకు భువనేశ్వర్‌లో బయల్దేరాల్సిన భువనేశ్వర్ - ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12830) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 45 నిమిషాలు ఆలస్యంగా మధ్యాహ్నం 12.55 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 13న మధ్యాహ్నం 11.15 గంటలకు పూరిలో బయల్దేరాల్సిన పూరి - గాంధీదామ్ (22974) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ గంటున్నర ఆలస్యంగా మధ్యాహ్నం 12.45 గంటలకు బయల్దేరుతుంది.

ఆగిన లారీని ఢీకొట్టిన కారు

ఒకరి మృతి, మరొకరికి గాయాలు



మృతి చెందిన నర్సింగరావు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పూసపాటిరేగ: విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలోని గైతుల చోడవరం సీపీ ఆక్వా పరిశ్రమ సమీపంలో మంగళవారం సాయంత్రం ఆగి ఉన్న లారీని వెనుకనుంచి కారు బలంగా ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం నుంచి విశాఖ వెళ్తున్న కారు సీపీ ఆక్వా పరిశ్రమ సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న విశాఖపట్నంలోని మర్రిపాలెం ప్రాంతానికి చెందిన పక్కి నర్సింగరావు (50) అక్కడికక్కడే మృతి చెందాడు. కంచరపాలెం ప్రాంతానికి చెందిన కారు డ్రైవర్ బొడ్డుల జయప్రకాశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం విజయనగరం ఆస్పత్రికి తరలించారు. నర్సింగరావు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించారు.